సంపుటి :03 | సంచిక :44 | పేజీలు :06 | www.aksharadarbar.com

# అక్షర దర్బార్

Voice of the People

వెల ₹5


మంగళవారం 24, మార్చి 2026

## అడవిని వీడుతున్న అగ్రనేత

- పాపారావు సంచలన నిర్ణయం

03





# వంటింట్లో ధరల మంట

## సామాన్యుడి ఇంట పశ్చిమాసియా యుద్ధ ప్రభావం


- ఆకా శానికి నిత్యావసర సరుకుల ధరలు
- జాబితాలో బియ్యం, పామాయిల్, ప్లాస్టిక్ వస్తువులు..
- దిగుమతులు తగ్గడం.. షిప్పింగ్ చార్జీలు పెరగడమే కారణం
- కొండెక్కిన కోడి ధరలు.. కిలో రూ.380 వరకు అమ్మకాలు
- ఉమ్మడి వరంగల్ జిల్లా అంతటా ఇదే పరిస్థితి

03

పశ్చిమాసియాలో రేగిన యుద్ధ జ్వాలలు భారత్‌లోని ప్రతి సామాన్యుడి వంటింట్లో మంట పుట్టిస్తున్నాయి. ఎక్కడో వేల కిలోమీటర్ల దూరంలో జరుగుతున్న అంతర్జాతీయ ఉద్రిక్తతలు స్థానిక మార్కెట్లపై పెను ప్రభావాన్ని చూపుతున్నాయి. ఒకవైపు నిత్యావసరాల ధరలు చుక్కలనంటుతుంటే, మరోవైపు చికెన్ ధరలు ఆల్‌టైమ్ రికార్డును సృష్టిస్తున్నాయి. కిలో చికెన్ ధర కొన్ని ప్రాంతాల్లో ఏకంగా రూ.400 మార్కును తాకడం విస్మయానికి గురి చేస్తోంది. ధరల పెరుగుదల జాబితాలో నూనెలు, బియ్యం, ప్లాస్టిక్ వస్తువులు ఉన్నాయి. నిత్యవసరాల ధరలు చుక్కలు చూపిస్తుండటంతో, రెక్కాడితే గానీ డొక్కాడని సామాన్యుడు తన కుటుంబాన్ని పోషించుకోలేని దుర్భర పరిస్థితి దాపురించింది. ఒకవైపు ఆదాయం పెరగక, మరోవైపు ఖర్చులు భారమై సామాన్యుడి బతుకు భారంగా మారింది. ఉమ్మడి వరంగల్ జిల్లా అంతటా దాదాపు ఇదే పరిస్థితులు నెలకొన్నాయి.

– అక్షరదర్బార్, వరంగల్

| | | | |
|---|---|---|---|
| పామాయిల్ (లీటర్) | 110 (910 గ్రా) | → 130 (795 గ్రా) | ↑ 20 (తగ్గిన పరిమాణం) |
| సన్ ఫ్లవర్ ఆయిల్ | ₹155 | → ₹180 | ↑ 25 |
| శనగ నూనె (లీటర్) | ₹150 | → ₹180 | ↑ 30 |
| బాస్మతి బియ్యం (కిలో) | ₹70-80 | → ₹110 | ↑ 30-40 |
| బియ్యం (25 కిలోలు) | ₹1,300-1,400 | → ₹1,600 | ↑ 200-300 |
| విస్తళ్లు (100కు) | ₹120 | → ₹160 | ↑ 40 |
| గ్లాసులు (37కు) | ₹18 | → ₹35 | ↑ 17 |
| ప్యాకింగ్ కవర్లు (కిలో) | ₹150 | → ₹280 | ↑ 130 |
| చికెన్ (స్కిన్‌లెస్ - కిలో) | ₹260-280 | → ₹360-400 | ↑ 100-120 |




# `డీ లిమిటేషన్`కు అడుగులు

## పార్లమెంట్‌లో బిల్లుకు కేంద్ర ప్రభుత్వం సిద్ధం

- బిల్లు ఆమోదం పొందితే భౌగోళిక స్వరూపాల మార్పు
- 50శాతం వరకు లోక్‌సభ, అసెంబ్లీ స్థానాల పెంపు
- ప్రస్తుతం ఉమ్మడి జిల్లాలో అసెంబ్లీ స్థానాల సంఖ్య 12
- పునర్విభజన తర్వాత 15 నుంచి 18 వరకు పెరిగే ఛాన్స్?
- మహిళలకు రిజర్వ్ కానున్న 33 శాతం స్థానాలు

02

**అక్షరదర్బార్, వరంగల్ :** దేశవ్యాప్తంగా నియోజకవర్గాల పునర్విభజన దిశగా కేంద్ర ప్రభుత్వం అడుగులు వేస్తోంది. లోక్‌సభ, అసెంబ్లీ స్థానాలను 50 శాతం మేర పెంచేలా కీలక బిల్లును పార్లమెంటులో ప్రవేశపెట్టేందుకు సిద్ధమవుతోంది. ఈ నిర్ణయం అమలైతే ఉమ్మడి వరంగల్ జిల్లా రాజకీయ ముఖచిత్రం పూర్తిగా మారనుంది. ప్రస్తుతం ఉన్న 12 అసెంబ్లీ స్థానాల సంఖ్య 15 నుంచి 18 వరకు పెరిగే అవకాశం కనిపిస్తోంది.

## చిన్నారిపై లైంగిక దాడి

- పోలీసుల అదుపులో ఇద్దరు బాలురు
- భూపాలపల్లి జిల్లాలో ఘటన

02


## కల్తీ కారం గుట్టురట్టు

- ఎనుమాముల మార్కెట్ సమీపంలో పోలీసుల మెరుపు దాడులు
- మిర్చి తొడిమలతో కారం తయారీ
- 70 కిలోల స్టాక్ స్వాధీనం
- నిర్వాహకులపై కేసు నమోదు

02

# 'డీ లిమిటేషన్'కు అడుగులు

- పార్లమెంట్‌లో బిల్లుకు కేంద్ర ప్రభుత్వం సిద్ధం
- బిల్లు ఆమోదం పొందితే భౌగోళిక స్వరూపాల మార్పు
- 50శాతం వరకు లోక్‌సభ, అసెంబ్లీ స్థానాల పెంపు
- ప్రస్తుతం ఉమ్మడి జిల్లాలో అసెంబ్లీ స్థానాల సంఖ్య 12
- పునర్విభజన తర్వాత 15 నుంచి 18 వరకు పెరిగే ఛాన్స్?
- మహిళలకు రిజర్వ్ కానున్న 33 శాతం స్థానాలు




అక్షరదర్బార్, వరంగల్ : దేశవ్యాప్తంగా నియోజకవర్గాల పునర్విభజన దిశగా కేంద్ర ప్రభుత్వం అడుగులు వేస్తోంది. లోక్‌సభ, అసెంబ్లీ స్థానాలను 50 శాతం మేర పెంచేలా కీలక బిల్లును పార్లమెంటులో ప్రవేశపెట్టేందుకు సిద్ధమవుతోంది. ఈ నిర్ణయం అమలైతే ఉమ్మడి వరంగల్ జిల్లా రాజకీయ ముఖచిత్రం పూర్తిగా మారనుంది. ప్రస్తుతం ఉన్న 12 అసెంబ్లీ స్థానాల సంఖ్య 15 నుంచి 18 వరకు పెరిగే అవకాశం కనిపిస్తోంది. రాష్ట్రం యూనిట్ గా పెరిగితే ఉమ్మడి వరంగల్ జిల్లాలో 2 నుంచి 3, ఉమ్మడి జిల్లాలో ఉన్న స్థానాల్లో యాభై శాతం పెరిగితే 6 అసెంబ్లీ స్థానాలు పెరిగే అవకాశం ఉంది. ఈ మార్పులతో జిల్లాలోని రాజకీయ సమీకరణలు సమూలంగా మారుతాయి. నియోజకవర్గాల సంఖ్య పెరిగితే ఉమ్మడి జిల్లాలోని పాత సరిహద్దులు మారతాయి. పలు జిల్లాల్లో కొత్త నియోజకవర్గాలు ఏర్పడతాయి. ఒక జిల్లాలోని మండలాలు మరో జిల్లాలోని నియోజకవర్గంలోకి వెళ్లే ఛాన్స్ ఉంది. దీనివల్ల భౌగోళికంగా నియోజకవర్గాల స్వరూపం మారిపోతుంది. ఓటర్ల సంఖ్య ప్రాతిపదికన కొత్త ప్రాంతాలను కలుపుతూ విభజన జరుగుతుంది. మొత్తానికి ఒక నియోజకవర్గం పూర్తిగా ఒకే జిల్లాలో ఉండే విధంగా ప్రతిపాదనలు జరగవచ్చని విశ్లేషకులు భాస్తున్నారు.

**- మారనున్న లెక్కలు**

స్థానాల పెంపుతో రిజర్వేషన్ల ప్రక్రియలో భారీ మార్పులు వస్తాయి. ప్రస్తుతం ఎస్సీ, ఎస్టీలకు రిజర్వ్ అయిన స్థానాల సంఖ్య పెరుగుతుంది. మహిళా రిజర్వేషన్ బిల్లు కూడా అమల్లోకి వస్తే లెక్కలు మరింత సంక్లిష్టంగా మారతాయి. జనరల్ స్థానాలు రిజర్వ్‌డ్ కావొచ్చు. రిజర్వ్ అయిన స్థానాలు జనరల్‌గా మారే అవకాశం ఉంటుంది. పాలకుర్తి, స్టేషన్ ఘన్‌పూర్, వర్ధన్నపేట వంటి అనేక నియోకవర్గాల్లో సామాజిక సమీకరణలు సైతం మారుతాయి. 33 శాతం స్థానాలు మహిళలకు రిజర్వ్ కానున్నందున ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఏ అసెంబ్లీ స్థానాలు మహిళలకు రిజర్వ్ అయ్యే అవకాశం ఉందనే చర్చ కూడా తెరపైకి వచ్చింది.

**- సిట్టింగ్ లు, ఆశావహుల ఆందోళన**

నియోజకవర్గాల మార్పుతో ప్రస్తుత ఎమ్మెల్యేల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారనుంది. తమ సొంత కేడర్ ఉన్న మండలాలు వేరే నియోజకవర్గంలోకి వెళ్తే సిట్టింగ్‌లు ఇబ్బంది పడతారు. వచ్చే ఎన్నికల్లో పోటీ చేయాలనుకున్న ఆశావహుల ఆశలు గల్లంతయ్యే ప్రమాదం ఉంది. నియోజకవర్గం రెండుగా చీలిపోవడం వల్ల పట్టున్న ప్రాంతం చేజారవచ్చు. కొత్త రిజర్వేషన్ల వల్ల సీటు దక్కని పరిస్థితి ఎదురవుతుంది.

**- 2029 ఎన్నికల నుంచే మార్పులు చేర్పులు..**

2023 సెప్టెంబరులో ఆమోదించిన మహిళా రిజర్వేషన్ బిల్లు ప్రకారం, చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు 2034 నుంచి అమల్లోకి రావాలి. రాజ్యాంగంలోని అధికరణలు 170(3), 81(3) నిబంధనల మేరకు, 2026 తర్వాత వెలువడే జనాభా లెక్కల ఆధారంగా నియోజకవర్గాల పునర్విభజన జరగాలి. అయితే, తాజా పరిణామాల ప్రకారం 2027 మార్చి 1 నాటికి జనగణన ప్రక్రియ పూర్తి కానుంది. వెంటనే నియోజకవర్గాల పునర్విభజనను చేపట్టే అవకాశం ఉంది. తద్వారా రిజర్వేషన్ల అమలును అనుకున్నదానికంటే ముందే పూర్తి చేసేందుకు కేంద్ర ప్రభుత్వం అన్ని రాజకీయ పార్టీల మద్దతు కూడగట్టే ప్రయత్నాలు జరుగుతున్నాయి.

---

## సాదాబైనామా దరఖాస్తులను పరిష్కరిస్తాం

- 9లక్షలమంది రైతులకు న్యాయం చేశాం
- రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

అక్షరదర్బార్, హైదరాబాద్ : రాష్ట్రంలో 2020 నుంచి పెండింగ్‌లో ఉన్న సాదాబైనామా దరఖాస్తులను త్వరలోనే పరిష్కరిస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ప్రకటించారు. మంగళవారం ఆయన అసెంబ్లీ వేదికగా ప్రసంగిస్తూ.. గత ప్రభుత్వం తీసుకొచ్చిన ఆర్.ఓ.ఆర్ (ఆర్వోఆర్) చట్టంలో వీటి పరిష్కారానికి సరైన మార్గం చూపలేదని ఆయన విమర్శించారు. తాజాగా ప్రభుత్వం జారీ చేసిన జీవో 76 ద్వారా ఈ ప్రక్రియ మరింత సులభతరం కానుంది. గతంలో కొనుగోలుదారు, అమ్మకందారు ఇద్దరి నుంచి అఫిడవిట్ తీసుకోవాలనే నిబంధన ఉండేది. దీనివల్ల క్షేత్రస్థాయిలో అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఇక నుంచి కేవలం కొనుగోలుదారు నుంచి మాత్రమే అఫిడవిట్ తీసుకుని సమస్యను పరిష్కరించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ నిర్ణయం వల్ల రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 9 లక్షలకు పైగా దరఖాస్తుదారులకు ఊరట లభించనుంది అని భరోసానిచ్చారు.

## కల్తీ కారం గుట్టురట్టు

- ఎనుమాముల మార్కెట్ సమీపంలో పోలీసుల మెరుపు దాడులు
- మిర్చి తొడిమలతో కారం తయారీ.. 70 కిలోల స్టాక్ స్వాధీనం
- నిర్వాహకులపై కేసు నమోదు

అక్షరదర్బార్, వరంగల్: ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడుతున్న కల్తీ రాయుళ్లపై వరంగల్ పోలీసులు, ఆహార భద్రతా అధికారులు కొరడా ఝుళిపించారు. వరంగల్ ఎనుమాముల వ్యవసాయ మార్కెట్ సమీపంలోని ఒక ఇండస్ట్రీస్‌లో నిబంధనలకు విరుద్ధంగా కల్తీ కారం తయారు చేస్తున్నట్లు అందిన విశ్వసనీయ సమాచారం మేరకు మంగళవారం సాయంత్రం అధికారులు మెరుపు దాడులు నిర్వహించారు.

**- తొడిమలే ముడిసరుకుగా..**

సాధారణంగా పారేసే మిర్చి తొడిమలను ఉపయోగించి, వాటికి రంగులు అద్ది కల్తీ కారం తయారు చేస్తున్నట్లు తనిఖీల్లో వెల్లడైంది. ఈ కేంద్రం నుంచి సుమారు 70 కిలోల కల్తీ కారం నిల్వలను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఆహార భద్రతా అధికారులు కృష్ణమూర్తి, మౌనికలతో కలిసి సీఐ సురేశ్ ఈ తనిఖీల్లో పాల్గొన్నారు.

**- కఠిన చర్యలు తప్పవు**

అనంతరం అధికారులు మాట్లాడుతూ.. తక్కువ ధరకే వస్తుందని ప్రజలు ఇలాంటి కల్తీ కారాన్ని కొని ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దని సూచించారు. నిబంధనలు ఉల్లంఘించి కల్తీకి పాల్పడుతున్న సదరు ఇండస్ట్రీ నిర్వాహకులపై కేసు నమోదు చేశామని, దర్యాప్తు కొనసాగుతోందని పోలీసులు తెలిపారు. ఇలాంటి అక్రమాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## చిన్నారిపై లైంగిక దాడి

- పోలీసుల అదుపులో ఇద్దరు బాలురు
- భూపాలపల్లి జిల్లాలో ఘటన

అక్షరదర్బార్, కాటారం : జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ ప్రాంతంలో దారుణం జరిగింది. ఒక గ్రామంలో ఓ ఐదేళ్ల బాలిక మంగళవారం తన ఇంటి ముందు ఆడుకుంటుండగా, ఇద్దరు బాలురు ఆమెను బలవంతంగా పక్కనే ఉన్న ఒక పార్కులోకి ఎత్తుకెళ్లారు. అక్కడ ఆ చిన్నారిపై వారు లైంగిక దాడికి పాల్పడ్డారు. ఈ అమానుష ఘటనలో చిన్నారి తీవ్ర అస్వస్థతకు గురైంది. చిన్నారి పరిస్థితిని గమనించిన తల్లిదండ్రులు వెంటనే స్పందించి ఆమెను చికిత్స నిమిత్తం సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు రంగంలోకి దిగారు. నిందితులైన ఇద్దరు బాలురను పోలీసులు ఇప్పటికే అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. వారిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఈ దారుణానికి సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## స్తంభించిన రిజిస్ట్రేషన్లు

- మొరాయించిన సర్వర్లు.. ఇబ్బంది పడిన ప్రజలు

అక్షరదర్బార్, హైదరాబాద్: రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో మంగళవారం రిజిస్ట్రేషన్లు నిలిచిపోయాయి. ఉదయం నుంచి సర్వర్లు పని చేయకపోవడంతో క్రయవిక్రయదారులు ఇబ్బంది పడ్డారు. స్లాట్ బుకింగ్ నుంచి డాక్యుమెంట్ వెరిఫికేషన్, ఈ–కేవైసీ ప్రక్రియ వరకు ఏ పనీ ముందుకు సాగకపోవడంతో ఆందోళనకు గురయ్యారు. రిజిస్ట్రేషన్ల కోసం ఇప్పటికే స్లాట్లు బుక్ చేసుకున్న వారు, సాక్షులు, కొనుగోలుదారులు గంటల తరబడి కార్యాలయాల వద్ద పడిగాపులు కాశారు. దూర ప్రాంతాల నుంచి వచ్చిన వారు సర్వర్లు ఎప్పుడు పునరుద్ధరణ అవుతాయో తెలియక సతమతమయ్యారు. అధికారుల నుంచి సరైన సమాచారం లేకపోవడంతో కొందరు ఆగ్రహం వ్యక్తం చేస్తూ వాగ్వాదానికి దిగారు. రిజిస్ట్రేషన్ల శాఖకు చెందిన ప్రధాన సర్వర్లలో తలెత్తిన సాంకేతిక లోపం వల్లే ఈ సమస్య తలెత్తినట్లు తెలుస్తోంది. ఉన్నతాధికారులు వెంటనే స్పందించి సాంకేతిక బృందాలను రంగంలోకి దించారు. సర్వర్ వ్యవస్థను పునరుద్ధరించేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేశారు. వీలైనంత త్వరగా సేవలను అందుబాటులోకి తెస్తామని అధికారులు చెబుతున్నారు.

## అధికార పార్టీది పక్షపాత ధోరణి

**టీఆర్ఎస్ కౌన్సిలర్ల నిరసన**




నర్సంపేట, అక్షర దర్బార్: అధికార కాంగ్రెస్ పార్టీ పక్షపాత ధోరణితో వ్యవహరిస్తోందని ఆరోపిస్తూ టీఆర్ఎస్ కౌన్సిలర్లు మంగళవారం మున్సిపల్ కార్యాలయం ముందు నిరసన చేపట్టారు. తమ వార్డుల్లో పారిశుద్ధ్య పనులు సక్రమంగా జరగక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కాలువలు శుభ్రం చేయకపోవడం వల్ల దోమలు పెరిగి, దుర్వాసనలు వస్తున్నాయని పేర్కొన్నారు. తాగునీటి సరఫరా కూడా సరిగా లేదని అన్నారు. సమస్యలను కమిషనర్ దృష్టికి తీసుకెళ్లినా పరిష్కారం కాలేదని విమర్శించారు. సిబ్బంది కేటాయింపులో కూడా వివక్ష చూపుతున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా జనరల్ బాడీ సమావేశం ఏర్పాటు చేసి, కౌన్సిలర్ల సూచనలతో శానిటేషన్, తాగునీటి సమస్యలను తక్షణమే పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు.

# వంటింట్లో ధరల మంట



- సామాన్యుడి ఇంట పశ్చిమాసియా యుద్ధ ప్రభావం
- ఆకాశానికి నిత్యావసర సరుకుల ధరలు
- జాబితాలో బియ్యం, పామాయిల్, ప్లాస్టిక్ వస్తువులు..
- దిగుమతులు తగ్గడం.. షిప్పింగ్ చార్జీలు పెరగడమే కారణం
- కొండెక్కిన కోడి ధరలు.. కిలో రూ.380 వరకు అమ్మకాలు
- ఉమ్మడి జిల్లా అంతటా ఇదే పరిస్థితి

**అక్షరదర్బార్, వరంగల్ :**

పశ్చిమాసియాలో రేగిన యుద్ధ జ్వాలలు భారత్‌లోని ప్రతి సామాన్యుడి వంటింట్లో మంట పుట్టిస్తున్నాయి. ఎక్కడో వేల కిలోమీటర్ల దూరంలో జరుగుతున్న అంతర్జాతీయ ఉద్రిక్తతలు స్థానిక మార్కెట్లపై పెను ప్రభావాన్ని చూపుతున్నాయి. ఒకవైపు నిత్యావసరాల ధరలు చుక్కలనంటుతుంటే, మరోవైపు చికెన్ ధరలు ఆల్‌టైమ్ రికార్డును సృష్టిస్తున్నాయి. కిలో చికెన్ ధర కొన్ని ప్రాంతాల్లో ఏకంగా రూ.400 మార్కును తాకడం విస్మయానికి గురి చేస్తోంది. ధరల పెరుగుదల జాబితాలో నూనెలు, బియ్యం, ప్లాస్టిక్ వస్తువులు ఉన్నాయి. నిత్యవసరాల ధరలు చుక్కలు చూపిస్తుండటంతో, రెక్కాడితే గానీ డొక్కాడని

### - కొండెక్కిన కోడి ధర

**వేసవి ఎండల తీవ్రత పౌల్ట్రీ రంగాన్ని కోలుకోలేని దెబ్బ తీసింది. భానుడి భగభగలకు కోళ్ల ఫారాల్లో వేలాది కోళ్లు మృత్యువాత పడటంతో ఉత్పత్తి గణనీయంగా పడిపోయింది. సప్లై తగ్గి డిమాండ్ పెరగడంతో చికెన్ ధరలు రికార్డు స్థాయికి చేరాయి. దీనికి తోడు ప్రస్తుతం ముహూర్తాల సీజన్ కావడంతో పెళ్లిళ్లు, ఇతర శుభకార్యాల కోసం చికెన్ వినియోగం విపరీతంగా పెరిగింది. పౌల్ట్రీ యజమానులు పెరిగిన మేత ఖర్చులు, కోళ్లను కాపాడుకోవడానికి చేసే అదనపు ఖర్చులను వినియోగదారులపైనే వేస్తున్నారు. ప్రస్తుతం స్కిన్ లెస్ చికెన్ ధర రూ.380 వరకు పలుకుతుండగా, నాటు కోడి ధర రూ.900 వరకు ఉండటం గమనార్హం. రాబోయే మే నెలలో ఎండలు మరింత ముదిరితే ఈ ధరలు సామాన్యుడికి శాశ్వతంగా దూరమయ్యే ప్రమాదం ఉందని వ్యాపారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.**

సామాన్యుడు తన కుటుంబాన్ని పోషించుకోలేని దుర్భర పరిస్థితి దాపురించింది. ఒకవైపు ఆదాయం పెరగక, మరోవైపు ఖర్చులు భారమై సామాన్యుడి బతుకు భారంగా మారింది. ఉమ్మడి వరంగల్ జిల్లా అంతటా దాదాపు ఇదే పరిస్థితులు నెలకొన్నాయి.

### - నింగినంటుతున్న ధరలు

అంతర్జాతీయంగా ముడిచమురు ధరల పెరుగుదల రవాణా వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపింది. యుద్ధం కారణంగా దిగుమతులు నెమ్మదించడం, షిప్పింగ్ ఛార్జీలు పెరగడం వల్ల మార్కెట్లో ప్రతి వస్తువు ధర భారంగా మారింది. గతంలో కిలో రూ.70 నుంచి రూ.80 మధ్య ఉన్న బాస్మతి బియ్యం ఇప్పుడు రూ.110కి చేరింది. సామాన్యులు వాడే సాధారణ బియ్యం 25 కిలోల బస్తాపై ఏకంగా రూ.200 వరకు అదనపు భారం పడింది. ప్లాస్టిక్ ముడిసరకు దిగుమతి తగ్గిపోవడంతో నిత్యం శుభకార్యాల్లో విని యోగించే గ్లాసులు, విస్తళ్లు, ప్యాకింగ్ కవర్ల ధరలు కూడా రెట్టింపయ్యాయి. గతంలో 100 విస్తళ్ల ప్యాకెట్ రూ.120కి వచ్చేది, ఇప్పుడు అది రూ.160కి చేరింది. ఈ అదనపు ఖర్చులు మధ్యతరగతి, పేద కుటుంబాల బడ్జెట్‌ను తలకిందులు చేస్తున్నాయి.

### - తక్కువ కొలతతో అమ్మకాలు

ధరల పెరుగుదల ఒక ఎత్తయితే, కొన్ని కంపెనీలు ప్యాకింగ్ కొలతలు తగ్గించి వినియోగదారులను తెలివిగా మోసం చేస్తున్నాయి. సాధారణంగా ఒక లీటరు అంటే 910 గ్రాముల పరిమాణంతో వంట నూనె ప్యాకెట్లను విక్రయించేవారు. కానీ, ఇప్పుడు యుద్ధ ప్రభావం పేరుతో ధరను స్వల్పంగా పెంచి, లోపల ఉండే నూనె పరిమాణాన్ని ఏకంగా 795 గ్రాములకు తగ్గించేశాయి. కేవలం ప్యాకెట్ ధరను మాత్రమే చూసే సామాన్య వినియోగదారులు లోపల గ్రాముల లెక్కను గమనించలేకపోతున్నారు. దీనివల్ల ఐదుగురు సభ్యులున్న ఒక కుటుంబం నెలకు విని యోగించే సగటు నూనెలో వారికి తెలియకుండానే పెద్ద మొత్తంలో నష్టం జరుగుతోంది. ఇది ముమ్మాటికీ వినియోగదారులను తప్పుదోవ పట్టించడమేనని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

### - కృత్రిమ కొరత?

యుద్ధం వల్ల నిజంగానే ధరలు పెరిగాయా లేదా ఇది హోల్‌సేల్, రిటైల్ వ్యాపారుల మాయాజాలమా అన్న సందేహాలు బలంగా వ్యక్తమవుతున్నాయి. అంతర్జాతీయంగా ముడిసరకు ధరలు పెరిగిన మాట వాస్తవమే అయినా, దానిని సాకుగా చూపి కొందరు వ్యాపారులు విపరీతమైన లాభాలను ఆర్జిస్తున్నారు. పాత ధరలకు కొన్న నిల్వలను కూడా గోడౌన్లలో దాచిపెట్టి, కృత్రిమ కొరతను సృష్టిస్తున్నారు. మార్కెట్లో వస్తువులు లేవనే భ్రమను కల్పించి, కొత్తగా పెరిగిన ధరలకే పాత స్టాక్‌ను విక్రయిస్తూ దోపిడీకి పాల్పడుతున్నారు. ప్రభుత్వం ధరల నియంత్రణపై నిఘా పెట్టకపోవడం, తనిఖీలు నిర్వహించకపోవడం వ్యాపారులకు వరంగా మారింది. అధికారులు తక్షణమే స్పందించి అక్రమ నిల్వలపై దాడులు చేయకపోతే సామాన్యుడి పరిస్థితి అగమ్యగోచరంగా మారుతుంది.

# అడవిని వీడుతున్న అగ్రనేత

### - పాపారావు సంచలన నిర్ణయం



అక్షరదర్బార్, రాయ్‌పూర్ : నాలుగు దశాబ్దాలుగా ఛత్తీస్‌గఢ్ బస్తర్ అడవులను తన కంచుకోటగా మార్చుకున్న మావోయిస్టు అగ్రనేత పాపారావు సాయుధ పోరాటానికి స్వస్తి పలికారు. 17 మంది సహచరులతో కలిసి జనజీవన స్రవంతిలో చేరాలని ఆయన తీసుకున్న నిర్ణయం తీసుకున్నారు. ఇంద్రావతి నేషనల్ పార్క్ ఏరియాలో మావోయిస్టుల వెన్నెముకగా ఉన్న ఈ బృందం లొంగిపోవడంతో నక్సల్స్ ఉనికి దాదాపు ప్రశ్నార్థకంగా మారింది. ఇకపై భారత రాజ్యాంగ పరిధిలో ఉంటూ, ప్రజాస్వామ్య పద్ధతిలోనే ప్రజల గొంతుకను వినిపిస్తానని పాపారావు ప్రకటించడం గమనార్హం. ప్రభుత్వ పునరావాస పథకం ద్వారా కొత్త జీవితాన్ని ప్రారంభించేందుకు ఆయన సిద్ధమయ్యారు. నక్సలిజం పూర్తిగా అంతమైనా కూడా ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం అప్రమత్తంగానే ఉండాలని భావిస్తోంది. శాంతిభద్రతల విషయంలో రాజీ పడబోమని, అడవుల్లో భద్రతా బలగాల మోహరింపు కొనసాగుతుందని ప్రభుత్వం స్పష్టం చేసింది. అభివృద్ధి పనులు వేగవంతం చేయడం ద్వారా మారుమూల గ్రామాల్లో ప్రజలకు భరోసా కల్పించాలని అధికారులు చూస్తున్నారు. తుపాకీ గొట్టం ద్వారా కాకుండా చర్చల ద్వారానే సమస్యలు పరిష్కారమవుతాయని పాపారావు రాకతో మరోసారి రుజువైంది.



# వసూళ్లలో వేగం పెంచండి

- కలెక్టర్, బల్దియా కమిషనర్ చాహత్ బాజ్ పాయ్
- క్షేత్రస్థాయిలో పన్ను వసూళ్ల తీరు పరిశీలన

అక్షరదర్బార్, హనుమకొండ: క్షేత్రస్థాయిలో పన్ను వసూళ్లలో వేగం పెంచాలని హనుమకొండ జిల్లా కలెక్టర్, బల్దియా కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ అన్నారు. మంగళవారం నగర పరిధిలోని 54వ డివిజన్ పరిధి కేయూసీ రోడ్ సమీపంలో కలెక్టర్, కమిషనర్ ఆకస్మికంగా సందర్శించి పన్ను వసూళ్ల తీరును పరిశీలించి వేగవంతంగా పూర్తి చేయుటకు అధికారులకు తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రత్యక్షం గా పన్నుల వసూళ్ల విధానాన్ని పరిశీలించి సూచనలు చేస్తూ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ముగింపుకు దశకు చేరుకుంటున్న ప్రస్తుత తరుణంలో పన్నుల లక్ష్యాన్ని చేరుకోవాల్సిన అవసరం ఉందని ఇందుకోసం నగరం లోని ప్రతి గృహానికి వెళ్లి ఆస్తి, నల్లా పన్నుల వసూళ్లను చేపట్టాలని అన్నారు. అనంతరం గృహ వినియోగదారుడు చెల్లించిన పన్ను సంబంధ రసీదును కలెక్టర్ చెల్లింపుదారునికి అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ నరేష్, వార్డు ఆఫీసర్ జెస్సీ ప్రియదర్శిని, బిల్ కలెక్టర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# డ్రైవర్లకు ఉచిత కంటి పరీక్షల శిబిరం

### - ప్రారంభించిన జిల్లా ఎస్పీ సంకీర్త్



అక్షరదర్బార్, భూపాలపల్లి: భూపాలపల్లి జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ ఆధ్వర్యంలో "అరైవ్ అలైవ్" కార్యక్రమంలో భాగంగా ఆటో, లారీ, టిప్పర్ డ్రైవర్ల కోసం మంగళవారం ఇక్కడ ఉచిత కంటి పరీక్షల శిబిరం జరిగింది. ఈ శిబిరాన్ని జిల్లా ఎస్పీ సంకీర్త్ రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. హన్మకొండకు చెందిన శరత్ ఐ కేర్ హాస్పిటల్ సహకారంతో సింగరేణి కమ్యూనిటీ హాల్‌లో ఈ శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలను తగ్గించడం, డ్రైవర్ల కంటి ఆరోగ్యంపై అవగాహన పెంపొందించడం, వారి ప్రాణ భద్రతను కాపాడడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యమని అన్నారు. డ్రైవర్లు తమ కంటి చూపును నిరంతరం పరీక్షించుకుని అవసరమైన చికిత్స పొందాలని సూచించారు.
ఇటీవలి కాలంలో రోడ్డు ప్రమాదాలు అధికమవుతున్న నేపథ్యంలో డ్రైవర్లు పాటించాల్సిన జాగ్రత్తలను వివరించారు. డ్రైవింగ్ సమయంలో సెల్‌ఫోన్ వినియోగించరాదని, మద్యం సేవించి వాహనం నడపరాదని, ఓవర్‌టేకింగ్, రాంగ్ రూట్ డ్రైవింగ్ వంటి ప్రమాదకర అలవాట్లను నివారించాలని సూచించారు. హెల్మెట్ లేకుండా ప్రయాణించడం ప్రమాదకరమని హెచ్చరించారు. కంటిచూపు సరిగా లేకపోవడం కూడా ప్రమాదాలకు కారణమవుతుందని, రోడ్డుపై సూచనలు స్పష్టంగా కనిపించకపోవడం వల్ల ప్రమాదాలు సంభవించే అవకాశం ఉందని తెలిపారు. శిబిరంలో 300 మందికి పైగా ఆటో, లారీ డ్రైవర్లు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ నరేష్ కుమార్, డీఎస్పీ సంపత్ రావు, సీఐ నరేష్ కుమార్, ఎస్సై సాంబమూర్తి పాల్గొన్నారు.



# మానవత్వానికి నిలువుటద్దం ఇనగాల

- చిన్నారి రుత్వికకు పునర్జన్మ
- ఇనగాల సహకారానికి తల్లిదండ్రుల కృతజ్ఞతలు

అక్షర దర్బార్, పరకాల: పరకాల పట్టణానికి చెందిన బొచ్చు శరత్–చైతన్య దంపతుల ఆరు నెలల చిన్నారి ఋత్విక గుండె సమస్యతో బాధపడుతుండగా, అత్యవసర శస్త్రచికిత్స అవసరమైంది. ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న కుటుంబం ఇనగాల వెంకట్రామ్ రెడ్డి సహాయం కోరగా, ఆయన వెంటనే స్పందించారు.ఇనగాల ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అపోలో హాస్పిటల్ యాజమాన్యంతో సమన్వయం చేసి, 'హృదాన్' ప్రోగ్రామ్ కింద జూబ్లీహిల్స్ అపోలోలో మార్చి 18న ఉచితంగా శస్త్రచికిత్స నిర్వహించారు. శస్త్రచికిత్స విజయవంతమై చిన్నారి ప్రస్తుతం కోలుకుంటోంది. ఈ సందర్భంగా చిన్నారితో కలిసి తల్లిదండ్రులు ఇనగాల నివాసానికి వెళ్లి కృతజ్ఞతలు తెలిపారు. చిన్నారి ఆరోగ్యం మెరుగుపడటం పట్ల ఆయన సంతోషం వ్యక్తం చేస్తూ, పాప భవిష్యత్తు మంచిగా ఉండాలని ఆకాంక్షించారు.

# నర్సంపేటను మోడల్ సిటీగా తీర్చిదిద్దుతాం

## : మున్సిపల్ చైర్ పర్సన్ పెండం శ్రీలక్ష్మీ రామానంద్



నర్సంపేట, అక్షర దర్బార్: నర్సంపేట పట్టణాన్ని సమగ్ర అభివృద్ధితో మోడల్ సిటీగా తీర్చిదిద్దుతామని మున్సిపల్ చైర్‌పర్సన్ పెండం శ్రీలక్ష్మీ రామానంద్ తెలిపారు. మంగళవారం మున్సిపల్ యంత్రాంగంతో కలిసి పట్టణంలోని 27వ వార్డులో పర్యటించిన ఆమె, స్థానిక వార్డు కౌన్సిలర్ ములకల వినోద సాంబయ్యతో కలిసి పారిశుధ్యం, సీసీ రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఎమ్మెల్యే మాధవరెడ్డి సహకారంతో పట్టణంలో మౌలిక సదుపాయాలను మెరుగుపరిచి రూపురేఖలను మార్చేందుకు కృషి చేస్తామని తెలిపారు. పట్టణ పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇస్తూ, ప్రతిరోజూ మున్సిపల్ శానిటేషన్ యంత్రాంగంతో సమావేశాలు నిర్వహిస్తామని చెప్పారు. పట్టణంలోని 30 వార్డుల్లో గ్యాంగ్‌వార్ కార్యక్రమాన్ని అమలు చేసి, ప్రతి వార్డుకు అవసరమైన సంఖ్యలో పారిశుధ్య కార్మికులు, వాహనాలను కేటాయిస్తామని పేర్కొన్నారు. వార్డు కౌన్సిలర్లు, మున్సిపల్ అధికారులు సమన్వయంతో పని చేస్తూ ప్రజలకు ఎప్పుడూ అందుబాటులో ఉండాలని, ప్రజల సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ వార్డు మెంబర్ గాజుల రమేష్, కాంగ్రెస్ పార్టీ నాయకులు రామగొని శ్రీనివాస్, మున్సిపల్ ఇంచార్జ్ సిద్ధార్థ, వాటర్ సప్లై ఇంచార్జ్ కాట శ్రీను, శానిటేషన్ జవాన్ బోడ మొగిలి, విద్యుత్ సిబ్బంది గోనెల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# మహిళా సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి

## నర్సంపేటలో ఇందిరమ్మ చీరల పంపిణీ



నర్సంపేట, అక్షర దర్బార్: మహిళాభివృద్ధితోనే దేశాభివృద్ధి సాధ్యమని, ఇందిరా గాంధీ ఆశయాల సాధనకు కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోందని నర్సంపేట మున్సిపల్ చైర్‌పర్సన్ పెండెం శ్రీలక్ష్మి రామానంద్ అన్నారు. మంగళవారం నర్సంపేట పట్టణంలోని మున్సిపాలిటీ పరిధిలో 9వ వార్డులో నిర్వహించిన ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించి, వార్డులోని మహిళలకు చీరలు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, నర్సంపేట పట్టణంలోని ప్రతి మహిళకు ఇందిరమ్మ చీరను అందించేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. మహిళల సంక్షేమం, సాధికారతకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని పేర్కొన్నారు. కార్యక్రమంలో స్థానిక వార్డు కౌన్సిలర్ రాయిడి కీర్తీ దుష్యంత్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి ప్రవళిక సందీప్, మున్సిపల్ అధికారులు, స్వయం సహాయక సంఘ సభ్యులు, 9వ వార్డు మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# నవజాత శిశువులకు మెరుగైన వైద్య సేవలందించాలి

## : కలెక్టర్ దివాకర టి.ఎస్.



ములుగు, అక్షర దర్బార్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో నవజాత శిశువులకు స్థానికంగానే మెరుగైన వైద్య సేవలు అందేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. ఆదేశించారు. మంగళవారం ఆయన జిల్లా ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేసి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలోని అన్ని వార్డులను సందర్శించి, అందుతున్న వైద్య సేవలు, శుభ్రత, సౌకర్యాలను పరిశీలించారు. ఆసుపత్రి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచిస్తూ, కొనసాగుతున్న నిర్మాణ, అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ చంద్రశేఖర్, డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్ ఫర్ సర్వీసెస్ డాక్టర్ జగదీశ్వర్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.




# ముందస్తు అరెస్టులు సిగ్గుచేటు

## : బీఆర్ఎస్వీ నేత కొమ్ముల శివ

శాయంపేట, అక్షర దర్బార్: అసెంబ్లీ ముట్టడి కార్యక్రమంలో భాగంగా తనను ముందస్తుగా అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు బీఆర్ఎస్వి రాష్ట్ర నాయకుడు కొమ్ముల శివ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్రంలో ప్రజాస్వామ్యానికి విరుద్ధంగా పాలన కొనసాగుతోందని విమర్శించారు. తెలంగాణ కోసం పోరాడిన ఉద్యమకారులకు తగిన గౌరవం ఇవ్వడం లేదని, వారికి ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రభుత్వం కాలయాపన చేస్తోందని ఆరోపించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు, నిరుద్యోగ భృతి, జాబ్ క్యాలెండర్ వంటి అంశాలను ఇప్పటివరకు అమలు చేయలేదని పేర్కొన్నారు. బీఆర్ఎస్వి నాయకులు, తెలంగాణ ఉద్యమకారులను అక్రమంగా అరెస్టు చేస్తూ ప్రభుత్వం ఒత్తిడి తీసుకువస్తోందని అన్నారు. రాబోయే కాలంలో ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెబుతారని, అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బిల్లులు అన్ని వర్గాలకు న్యాయం చేయడం లేదని విమర్శించారు. ఆరు గ్యారెంటీలపై ప్రజాపాలన చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

# లేబర్ కోడ్లు రద్దుకై ధర్నా..

## కార్మికుల హక్కులను దెబ్బతీసే విధంగా కేంద్ర ప్రభుత్వం చర్యలు

## సీఐటీయూ జిల్లా కోశాధికారి బొట్ల చక్రపాణి



అక్షర దర్బార్, పరకాల: కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన లేబర్ కోడ్లను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సిఐటియు ఆధ్వర్యంలో అంబేద్కర్ సెంటర్ వద్ద కార్మికులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కోశాధికారి బొట్ల చక్రపాణి మాట్లాడుతూ కార్మికుల హక్కులను దెబ్బతీసే విధంగా కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపడుతోందని విమర్శించారు. సంవత్సరాలుగా సాధించుకున్న కార్మిక చట్టాలను రద్దు చేసి యజమానులకు అనుకూలంగా మారుస్తోందన్నారు. ధరల పెరుగుదల, నిరుద్యోగ సమస్యలను పరిష్కరించకుండా కార్మికులపై భారాలు మోపుతున్నారని ఆరోపించారు. లేబర్ కోడ్లు రద్దు చేసే వరకు కార్మికులు ఐక్యంగా పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో హమాలి సంఘం జిల్లా అధ్యక్షులు బోచ్చు ఆదాం, నాయకులు బొచ్చు సాంబయ్య, దౌడు మొగిలి, రాజమౌళి, అశోక్, రవి, రఘు ప్రసాద్, సంపత్ కుమార్, మైనర్ సాంబయ్య, స్వామి, గడ్డం సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

# రాజీ మార్గమే రాజమార్గం

## : ఎస్సై పోచంపల్లి సతీష్




చిట్యాల, అక్షర దర్బార్, మార్చి 24: ఎవరికి ఇబ్బందులు కలగకుండా, ఆర్థిక నష్టాలు లేకుండా వివాదాలను పరిష్కరించుకోవడానికి రాజీ మార్గమే ఉత్తమమని చిట్యాల ఎస్సై పోచంపల్లి సతీష్ పేర్కొన్నారు. మంగళవారం పోలీస్ స్టేషన్‌లో ఆయన మాట్లాడుతూ, ఈ నెల 28న నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్ కక్షిదారులందరికీ ఒక సువర్ణావకాశమని తెలిపారు. కోర్టుల చుట్టూ తిరగకుండా, తక్కువ సమయంలో, ఎటువంటి ఖర్చు లేకుండా కేసులను పరిష్కరించుకునే అవకాశం లోక్ అదాలత్ ద్వారా లభిస్తుందని ఆయన వివరించారు. శాంతిభద్రతలకు విఘాతం కలగని చిన్నపాటి కేసులు, రోడ్డు ప్రమాదాలకు సంబంధించిన ఇన్సూరెన్స్ మరియు నష్టపరిహార వివాదాలు, కుటుంబ సమస్యలు, భార్యాభర్తల మధ్య మనస్పర్థలు, ఆస్తి తగాదాలు, బ్యాంక్ రికవరీ కేసులు వంటి అనేక వివాదాలు ఇక్కడ పరిష్కారం పొందుతాయని తెలిపారు. కోర్టుల చుట్టూ తిరుగుతూ సమయం, డబ్బు వృథా చేసుకోకుండా ఈ నెల 28న జరిగే లోక్ అదాలత్‌ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని, రాజీ మార్గమే రాజమార్గమని గుర్తించి తమ సమస్యలను సామరస్యంగా పరిష్కరించుకోవాలని ఎస్సై సతీష్ విజ్ఞప్తి చేశారు.



# సీసీ రోడ్లను సద్వినియోగం చేసుకోండి

## : కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సిద్దన రమేష్

చెన్నారావుపేట, అక్షర దర్పర్: గ్రామాల్లో నిర్మిస్తున్న సీసీ రోడ్లను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కాంగ్రెస్ పార్టీ చెన్నారావుపేట మండల అధ్యక్షుడు సిద్ధన రమేష్ పిలుపునిచ్చారు. గ్రామ సర్పంచ్ జినుకల కనకమల్లు విక్రమ్, ఈర్యా నాయక్‌లతో కలిసి మంగళవారం మండలంలోని ఎల్లయ్య గూడెం, పదహారు చింతల, పుల్లయ్యబోడు తండాల్లో సీసీ రోడ్ల పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఎమ్మెల్యే దొంతి మాధవ రెడ్డి సహకారంతో గ్రామ ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యం కల్పించేందుకు సీసీ రోడ్ల నిర్మాణాన్ని చేపడుతున్నట్లు తెలిపారు. గ్రామాల అభివృద్ధిలో భాగంగా ఈ పనులు కీలకమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి మొగిలి వెంకట్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి మంద యాకయ్య గౌడ్, గ్రామ సర్పంచ్లు ఉమా, మోహన్ నాయక్, లావణ్య, హనుమ నాయక్, మైబు సింగ్ రాథోడ్, రవి నాయక్, దారా రంజిత్, యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బండి హరీష్, బాణోత్ రమేష్, పానుగంటి కొమురయ్య తదితరులు పాల్గొన్నారు. అలాగే మాజీ సర్పంచ్ మజ్జిక రాంబాబు, గ్రామ కాంగ్రెస్ అధ్యక్షులు బాషబోయిన రమేష్, నర్సు నాయక్, మాజీ ఎంపీటీసీ వెంకటేశ్వర్లు, వార్డు సభ్యులు మరియు ఇతర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# సకాలంలో పన్నులు చెల్లించాలి

**మున్సిపల్ కమిషనర్ రమేష్**

ములుగు, అక్షర దర్బార్: ములుగు మున్సిపాలిటీ పరిధిలో పన్నుల వసూళ్లను వేగవంతం చేసేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు మున్సిపల్ కమిషనర్ రమేష్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మున్సిపాలిటీ అభివృద్ధికి పన్నులు ప్రధాన ఆదాయ వనరని, ప్రతి పౌరుడు తన బాధ్యతగా గృహ పన్నులు మరియు ఇతర పన్నులను సకాలంలో చెల్లించాలని సూచించారు. ప్రస్తుతం వరకు 54 శాతం పన్నులు వసూలయ్యాయని, మిగిలిన బకాయిలను 2026 మార్చి 31లోపు చెల్లించాలని ప్రజలను కోరారు. గడువు తేదీ అనంతరం చెల్లించే పన్నులపై వడ్డీ విధించబడుతుందని, అదనపు భారాన్ని తప్పించుకోవాలంటే గడువులోపే చెల్లింపులు చేయాలని విజ్ఞప్తి చేశారు. లేని పక్షంలో మున్సిపాలిటీ చట్టం–2019 ప్రకారం ఆస్తులు జప్తు చేసే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అందరూ సహకరించి ములుగు పట్టణ అభివృద్ధికి తోడ్పడాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ రాజేందర్, ఆర్ఐ శ్రీనివాస్, జూనియర్ అసిస్టెంట్ రమేష్, బిల్ కలెక్టర్లు పాల్గొని పన్నుల వసూళ్లలో పాల్గొన్నారు.



# బీఎల్ఓలకు ఓటర్ జాబితాపై శిక్షణ



అక్షరదర్బార్, పరకాల: పరకాల శాసనసభ నియోజకవర్గ పరిధిలో ఓటరు జాబితా పునఃసమీక్ష, ఎస్.ఐ.ఆర్ ఓటర్ మ్యాపింగ్‌పై బిఎల్ఓలు, బిఎల్ఓ సూపర్వైజర్లకు ఒకరోజు శిక్షణా కార్యక్రమం మంగళవారం పరకాల రెవెన్యూ డివిజనల్ అధికారి డాక్టర్ కె. నారాయణ అధ్యక్షతన నిర్వహించారు.పరకాల మండలానికి చెందిన సిబ్బందికి ఏ.ఎల్.ఎం, డి.ఎల్.ఎం ఆధ్వర్యంలో శిక్షణ ఇచ్చారు. ఓటర్ జాబితా సక్రమంగా నవీకరణ, ఓటర్ల మ్యాపింగ్ విధానాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ విజయలక్ష్మి , డీటీ సూర్య ప్రకాష్, ఎలక్షన్ సీనియర్ అసిస్టెంట్ సూరమల్ల భద్రయ్య, రెవెన్యూ ఇన్స్పెక్టర్ దామోదర్ తదితర రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇళ్ల ఎంపికలో పారదర్శకత పాటించాలి

**నిజమైన నిరుపేదలకు ప్రాధాన్యత ఇవ్వాలని ప్రజల డిమాండ్**

శాయంపేట, అక్షర దర్బార్: రాష్ట్రంలో ఇల్లు లేని ప్రతి పేద కుటుంబానికి గూడు కల్పించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని దశల వారీగా అమలు చేస్తోంది. ఇందులో భాగంగా రెండో విడతలో అర్హులైన పేదలకు ₹5 లక్షల ఆర్థిక సాయం అందిస్తూ కొత్త ఇళ్ల మంజూరు ప్రక్రియ కొనసాగుతోంది. మొదటి విడతలో లబ్ధి పొందని అర్హులైన కుటుంబాలకు ప్రాధాన్యత ఇస్తూ, పారదర్శకంగా ఇళ్లను కేటాయించనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. శాయంపేట మండలంలోని గ్రామాల్లో దరఖాస్తులను పరిశీలించి అర్హులైన వారికి విడతల వారీగా ఇళ్ల మంజూరు జరుగుతోంది. అయితే సొంత స్థలం ఉన్నప్పటికీ ఇల్లు లేని నిరుపేద కుటుంబాలకు ప్రాధాన్యత ఇవ్వాలని స్థానికులు కోరుతున్నారు. ఆర్థికంగా బలమైనవారిని పథకానికి అర్హులుగా చేయకుండా, నిజమైన అర్హులను గుర్తించి ఇళ్లను కేటాయించాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు. ఎంపిక ప్రక్రియలో పారదర్శకత పాటించి, నిరుపేదలకు న్యాయం చేయాలని వారు ప్రభుత్వాన్ని కోరారు.



# కాంగ్రెస్ నాయకులకు విలువలు లేవు

అక్షర దర్బార్, మల్హర్ : రాష్ట్రంలో కాంగ్రెస్ నాయకులు మానవతా విలువలను పక్కనపెట్టి, క్రీడలను ప్రోత్సహించాల్సింది పోయి హింసను ప్రేరేపిస్తున్నారని మల్హర్ మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు కుంభం రాఘవరెడ్డి విమర్శించారు. మంగళవారం కొయ్యూరు ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. నియోజకవర్గంలో క్రీడాకారులను అణచివేసే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆయన ఆరోపించారు. దుద్దిళ్ల సోదరులు సహా కొంతమంది కాంగ్రెస్ నాయకులు అవివేకంగా మాట్లాడుతున్నారని, ముందుగా ఎన్నికల్లో ఇచ్చిన 420 హామీలను అమలు చేసి తరువాతే ఇతర పార్టీలపై విమర్శలు చేయాలని సూచించారు. కార్యక్రమంలో మండల నాయకులు చంద్రకళ, యాదగిరిరావు, బాలాజీ నాయక్, సంపత్, సతీష్, రమేష్, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

# అక్రమ గ్యాస్ నిల్వలపై దాడి

**10 గ్యాస్ సిలిండర్లు స్వాధీనం**



అక్షర దర్బార్, చిట్యాల : ప్రజలకు సరఫరా చేయాల్సిన గ్యాస్ సిలిండర్లను కొంతమంది అక్రమంగా నిల్వ ఉంచుతున్న ఘటన చిట్యాల మండల కేంద్రంలో బయటపడింది. సమాచారం అందుకున్న సివిల్ సప్లై అధికారులు మంగళవారం దాడులు నిర్వహించి 10 నిండు గ్యాస్ సిలిండర్లను స్వాధీనం చేసుకున్నారు. బుక్ చేసిన వినియోగదారులకు సకాలంలో అందించకుండా, కృత్రిమ కొరత సృష్టించి అధిక ధరలకు విక్రయించేందుకు గ్యాస్ సిలిండర్లను నిల్వ చేస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ నేపథ్యంలో మండల కేంద్రంలోని సరిగమల ఆనంద్, నాగరాజు నివాసాల్లో గ్యాస్ నిల్వ ఉంచినట్లు సమాచారం రావడంతో సివిల్ సప్లై ఇన్స్పెక్టర్ రాజు తన బృందంతో దాడి చేసి సిలిండర్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఇన్స్పెక్టర్ రాజు మాట్లాడుతూ, గ్యాస్ సిలిండర్లను అక్రమంగా నిల్వ చేసే ఎవరినీ వదిలిపెట్టబోమని, కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# కూరగాయల సాగుకు ప్రోత్సాహం

**: ఉద్యానవన శాఖ అధికారి జ్యోతిరెడ్డి**



దుగ్గొండి, అక్షరదర్బార్: కూరగాయల పంటల సాగును ప్రోత్సహించేందుకు ప్రభుత్వం సబ్సిడీతో పాటు పలు సహాయాలను అందిస్తున్నట్లు ఉద్యానవన శాఖ నర్సంపేట డివిజన్ అధికారి జ్యోతిరెడ్డి తెలిపారు. మంగళవారం దుగ్గొండి మండలంలోని పలు గ్రామాల్లో ఆమె 100 శాతం సబ్సిడీపై కూరగాయల విత్తనాల కిట్లను రైతులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఉద్యానవన శాఖ ద్వారా రైతులకు టమాట, పచ్చిమిర్చి, బెండ, తోటకూర, పాలకూర వంటి ఐదు రకాల కూరగాయల విత్తనాలను ఉచితంగా అందిస్తున్నట్లు చెప్పారు. రాష్ట్రంలో కూరగాయల సాగు విస్తీర్ణాన్ని పెంచడం మరియు రైతులను ప్రోత్సహించడం లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి గాజుల శ్యామ్ కుమార్, వ్యవసాయ విస్తరణ అధికారి హనుమంత్, ఉద్యాన విస్తరణ అధికారి త్రివేణి, లక్ష్మీపురం, వెంకటాపురం, తొగర్రై, శివాజీ నగర్ గ్రామాల రైతులు పాల్గొన్నారు.

# అడ్వకేట్ ప్రొటెక్షన్ బిల్లుకు ఆమోదం..

**సీఎం రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు**

**మాజీ ఏజీపీ లక్కం శంకర్**

అక్షర దర్బార్, పరకాల: తెలంగాణ క్యాబినెట్ అడ్వకేట్ ప్రొటెక్షన్ బిల్లుకు ఆమోదం తెలపడం పట్ల రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి పరకాల బార్ అసోసియేషన్ తరపున న్యాయవాది, మాజీ ఏజీపీ లక్కం శంకర్ అభినందనలు తెలిపారు. రాష్ట్రంలో న్యాయవాదులపై జరుగుతున్న దాడులను దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం సముచితమని పేర్కొన్నారు. రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వం వేగంగా సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని కొనియాడారు. ఈ బిల్లు న్యాయవాదులకు రక్షణ కల్పించడంలో కీలక పాత్ర పోషిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

# ఫిన్లాండ్ విద్యా అధ్యయన కమిటీలో జూకల్ ఉపాధ్యాయురాలు ఎంపిక

చిట్యాల, అక్షర దర్బార్, మార్చి 24: విద్యా విధానాలపై అధ్యయనం చేయడానికి ఏర్పాటు చేసిన ఫిన్లాండ్ విద్యా అధ్యయన కమిటీలో చిట్యాల మండలంలోని జూకల్లు ఉన్నత పాఠశాల ఉపాధ్యాయురాలు శ్రీమతి మమత ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు కృష్ణ తెలిపారు. తెలంగాణ రాష్ట్ర విద్యా విధానాన్ని మరింత మెరుగుపరచాలనే ఉద్దేశంతో, ఇతర దేశాల్లో అమలులో ఉన్న ఆధునిక విధానాలను పరిశీలించేందుకు ఏర్పాటైన 28 మంది సభ్యుల కమిటీలో ఆమెకు చోటు దక్కడం విశేషమని పేర్కొన్నారు. మమత ఎంపికపై హెచ్ఎం కృష్ణ, సర్పంచ్ సంధ్యారాణి, ఉపసర్పంచ్ మహమ్మద్ అమీర్ సొహెల్, విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు.

# తాగి వాహనం నడిపితే జైలుకే

అక్షర దర్బార్ చిట్యాల : తాగి వాహన వాహనం నడుపుతూ పోలీసులకు చిక్కిన వ్యక్తికి 2000 రూపాయల జరిమానా తో పాటు రెండు రోజులు జైలుకు వెళ్లాల్సిన పరిస్థితి దాపురించింది. చిట్యాల పోలీస్ స్టేషన్ పరిధిలో స్థానిక ఎస్సై పోచంపల్లి సతీష్ ఆధ్వర్యంలో చేపట్టిన డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో కనిపర్తి గ్రామానికి చెందిన మునిగాల రమేష్ అనే వ్యక్తి పట్టుపడ్డాడు. మంగళవారం రమేష్ ను కోర్టుకు తరలించగా మద్యం సేవించి వాహనం నడిపిన విషయం రూఢి కావడంతో పట్టుబడిన వ్యక్తికి జయశంకర్ భూపాలపల్లి ప్రిన్సిపల్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ జడ్జి దిలీప్ నాయక్ గారు రెండు రోజుల సాధారణ జైలు శిక్ష 2100 జరిమానా విధిస్తూ తీర్పునిచ్చింది. దీనితో రమేష్ ను పరకాల సబ్ జైలుకు తరలించారు.

# నూతన ఎస్సైని సన్మానించిన మాజీ సర్పంచులు



అక్షర దర్బార్, చిట్యాల : ఇటీవల చిట్యాల మండల నూతన ఎస్సైగా పదవీ బాధ్యతలు చేపట్టిన పోచంపల్లి సతీష్ గారిని మంగళవారం చిట్యాల మండలంలోని కాంగ్రెస్ పార్టీ నాయకులు మాజీ సర్పంచులు కామెడీ రత్నాకర్ రెడ్డి గజ్జి రవి చింతల సుమన్ లు ఎస్సై కార్యాలయంలో ఆయనను శాలువాతో సన్మానించారు మండలంలో శాంతిభద్రతలను అమలు చేస్తూ ప్రజలకు సేవ చేయటంలో ముందుండాలని ఆకాంక్షిస్తూ వారు అభినందనలు తెలియజేశారు.




# మీ గొంతుక!
# మీ నమ్మకం!

## అక్షర దర్బార్

ప్రతి అక్షరం.. ప్రజా సంక్షేమం!

## ఎందుకు అక్షర దర్బార్?

- **నిజమైన వార్తలు** : నిష్పక్షపాతంగా, పారదర్శకంగా వార్తలను అందిస్తాం.
- **మీ సమస్యల పరిష్కారం** : స్థానిక సమస్యల నుండి ప్రభుత్వ పథకాల అమలు వరకు, మీ ప్రతి సమస్యను వెలుగులోకి తెస్తాం.
- **సమాజహితమే లక్ష్యం** : ప్రజల గొంతుకగా మారి, సామాజిక బాధ్యతతో పనిచేస్తాం.
- **ఈ-పేపర్ అందుబాటులో** : ఎక్కడ ఉన్నా, ఎప్పుడైనా మీ వార్తలను చదవండి.

డిజిటల్ విప్లవంలో భాగంకండి!

"అక్షర దర్బార్" ఈ-పేపర్ కోసం QR కోడ్‌ను స్కాన్ చేయండి.
వేగంగా, సులభంగా వార్తలను పొందండి.

**ప్రతిరోజూ మీ ఇంటికి, మీ మనసుకి చేరువగా "అక్షర దర్బార్"!**

**మీ నమ్మకమే మా బలం!**

Printed, Published & Owned by VEMULA RAJESHWER RAO, printed at VR PUBLICATIONS, H.NO 7-1-364/16/A, Sriram Nagar, Padmakshi gutta colony, Hanamkonda, Pin 506001, Telangana State.
Editor : VEMULA RAJESHWAR RAO, Email : akshardarbarnews@gmail.com, Office No:7680992278 *RNI NO.TELTEL/2022/81915